www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 16 జులై 2024



రాయితీ రుణాలు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు తిరిగి ప్రవేశపెట్టాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాయితీ రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాలకు ఉపాధి కల్పించారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వాటిని నిలిపి వేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ ఎస్సి, ఎస్టి హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షులు జె.వి.రమణ, జిల్లా బిసి మహాసభ అధ్యక్షులు పి.వి.రమణ, జనతాదళ్ (ఎస్) రాష్ట్ర అధ్యక్షులు వై.యం.ప్రతాపరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వికలాంగ పింఛన్లపై పిడుగు!

- ఉమ్మడి జిల్లాలో 3,513 మందిపై విచారణ
- నేడు అన్నమయ్య జిల్లాలో రీ అసెస్మెంట్ పరీక్ష
- వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా పలువురికి నోటీసులు

జిల్లాలోని వికలాంగ (దివ్యాంగుల) పింఛనుదారులపై కత్తెరింపు పిడుగు పడనుంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో నకిలీలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్లు విచారణకు ఆదేశించారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం 3,513 మంది వికలాంగ పింఛనుదారులను విచారించనుంది. పలువురు పింఛనుదారులకు నోటీసులను సైతం జారీ చేసింది. ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నఫళంగా వికలాంగ పింఛనుదారులకు నోటీసులు జారీ చేయడంతో అయోమయం నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 2,66,385 మంది ఫింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా సుమారు రూ.120 కోట్ల మేర చెల్లింపులు చేస్తోంది. వీరిలో 39,839 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. జిల్లాలోని సామాజిక పింఛన్ల కేటగిరీలో ఒఎపి పింఛనుదారుల అనంతరం వికలాంగ పింఛనుదారులే అధికంగా ఉండడం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో నకిలీ పింఛన్లు ఉన్నాయనే ఫిర్యాదులు రావడంతో కలెక్టర్లు విచారణకు ఆదేశించారు. వైఎస్ఆర్ జిల్లాలో 3,500 పెన్షనుదారులను నకిలీగా భావించింది. నోటీసులు సైతం జారీ చేసింది. సింహాద్రిపురం మండలంలోనే 44 మందికి నోటీసులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో 2,23,436 మంది పెన్షనుదారులు ఉన్నారు. వీరికి సుమారు రూ.110 కోట్ల మేరకు చెల్లింపులు చేయాల్సి వస్తోంది. వీరిలో 26,849 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 1040 మంది బెడెడ్ వికలాంగులు ఉండడం గమనార్హం. రామాపురం మండలానికి చెందిన 13 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణకు ఆదేశించింది. వెరసి ఉభయ జిల్లాలో 3,513 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టనున్నారు. అన్నమయ్య జిల్లా యంత్రాంగం మదనపల్లికి చెందిన వైదులతో 13 పింఛనుదారులకు రీఅసెస్మెంట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం వికలాంగత్వం తీవ్రత ఆధారంగా రూ.ఆరు వేల మేరకు పింఛను చెల్లింపులు చేస్తోంది. పెరాలసిస్ వంటి మంచానికి పరిమితమైన రోగులకు రూ.15 వేల వరకు చెల్లిస్తోంది. ఇటువంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి
పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 17 నెలల గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఎల్, ఎల్-2, ఎల్-3, ఎంటి, మోడల్ మేకర్లుగా జిల్లా వ్యాప్తంగా 600 మంది పని చేస్తున్నారని చెప్పారు. వివిధ రకాల కేటగిరీలలో డివిజన్, మండల, గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్నారని తెలిపారు. సొంత భూముల్లో ఎన్నో ప్రయోగాలు చేసి కష్టనష్టాలు అనుభవించి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. రైతుల వద్దకు ప్రకృతి వ్యవసాయాన్ని తీసుకువెళుతున్నారని చెప్పారు. వీరికి ఇచ్చే అరకొర గౌరవ వేతనం 17 నెలలుగా పెండింగ్ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం, అవసరాలు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జూన్ 1న కలెక్టరు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని చెప్పారు. 30లోపు ఇస్తామన్నా అధికారి ఇంతవరకు సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. బాధితులకు న్యాయం చేయకపోతే డిపిఎంయు కార్యాలయం మూసివేస్తామని కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లు హెచ్చరించారు. అనంతరం ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ నుంచి ప్రకృతి వ్యవసాయ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షులు గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓబులయ్య, కోశాధికారి కృష్ణారెడ్డి, దాదాపు 450 మంది సిబ్బంది, రిమ్స్ ఆప్కాస్ సభ్యులు పవన్ పాల్గొన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ప్రజాశక్తి - కడప : జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని, వారి సమస్యలను సంతృప్తిచెందేలా వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జెసితోపాటు డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



యుకె పేటెంట్ పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్

బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి యుకె పేటెంట్ మంజూరు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతిక శాస్త్ర రీడర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి 'డివైస్ ఫర్ కంట్రోల్లింగ్ ద స్టెమ్ బోరర్ ఇన్సెక్ట్ ఇన్ క్రాప్ మేనేజ్మెంట్' అనే అంశం మీద వ్యాసాన్ని పేటెంట్ హక్కుల కోసం ఈనెల 3న దరఖాస్తు చేసుకోగా 10న కాంప్ట్రోల్లర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆఫీసు, యునైటెడ్ కింగ్ డమ్ (యుకె) దేశం వారు పేటెంట్ సర్టిఫికెట్‌ను మంజూరు చేశార్నఇ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భగా ప్రిన్సిపల్, అధ్యాపక, ఆద్యాపకేతర బృందం సుధాకర్ రెడ్డి అభినందించారు.

పానకం పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప నగరం హబీబుల్లా వీధి బాలకృష్ణ అండ్ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్.అల్లా బాకాష్ ఆధ్వర్యంలో మొహరం పీర్ల పండుగ సందర్భంగా ప్రజలకు పానకం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాదీ మొహరం పీర్ల పండుగ సందర్భంగా పాతియా చేసిన అనంతరం పానకము పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్, మైనారిటీ సెల్ యువ నాయకులు బి.అబ్దుల్లా, రాయల్ కరిముల్లా, సంధా నరేంద్ర కుమార్, లాయర్ వేణుగోపాల్, రవి, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కేశన శంకర్‌రావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కడప సిటీ : బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు జన్మదిన వేడుకలను జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గల్లి నుండి ఢిల్లీ వరకు బిసిల సమస్యలపై గల మెత్తిన నాయకుడు శంకర్రావు అని కొనియాడారు. చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, అన్ని జిల్లాలలో బిసి భవనాలను నిర్మాలించాలని, బిసి విద్యార్థులకు ఫీజుల్లో మినహాయింపు ఇవ్వాలని పోరాటలు చేశారని పేర్కొన్నారు. అనంతరం నగరంలోని అమ్మ అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, పార్లమెంట్ అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు, గౌరవ సలహాదారులు వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ అధ్యక్షులు సిఆర్ఐ సునీల్. ఉపాధ్యక్షులు కళ్యాసుధాకర్, నగర అధ్యక్షులు నరసింహ, ఉపాధ్యక్షులు అంజి, మళ్లీ యాదవ్, ఆర్ల గంగయ్య, పట్టు పొగుల సుబ్బారావు, రంగయ్య పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు జెస్సికా ఎంపిక

ప్రజాశక్తి - కడప : త్వరలో నిర్వహించే జాతీయ స్కేటింగ్ పోటీలకు కడప జిల్లా క్రీడాకారిణి జెస్సికా ఎంపికయింది. ఈనెల 11, 12 తేదీలలో 53వ కేంద్రీయ విద్యాలయ సంగతన్ హైదరాబాదులో నిర్వహించిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో జెస్సికా మంచి ప్రతిభ కనబరచి రెండు సిల్వర్ మెడల్స్ ఒక రజక పథకాన్ని సాధించింది. త్వరలో జరగబోవు జాతీయ స్కేటింగ్ పోటీలకు ఆమెను ఎంపిక చేశారు.

పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ -19 సమయంలో మున్సిపల్ కార్మికుల చేత పారిశుధ్య పనులు చేయించుకుని కార్మికులు దైవసమానాలంటూ వారి కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన పోసుకోవాలని ప్రభుత్వాలు, అధికారులు ఫ్రంట్ సైడ్ వారియర్స్ అనే బిరుదులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టం తగ్గ జీతం కానీ, ఉద్యోగ భద్రత కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు. కరోనా టైంలో ప్రపంచమంతా బయటకు తిరిగిందుకే భయపడుతుంటే మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి భార్య, బిడ్డలను, కుటుంబాలను విడనాడి ప్రజలకు ఎంతో సేవ చేశారని తెలిపారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు వారికి ఉద్యోగ భద్రత, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. నగర నాయకులు సుంకర రవి మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా మున్సిపల్ రంగం పారిశుధ్య కార్మికులు పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆందోళనలు, పోరాటాలు చేసి ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు వినతి పత్రాలు అందజేసిన పరిష్కారం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకున్న కార్మికులకు, కోవిడ్ - 19 కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అకౌంట్లు తెరవాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు ఇటీవల ముగ్గురు కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలకు ఎటువంటి భరోసా కానీ, ఆర్థిక సహాయం కానీ అందలేదని తెలిపారు. ఇకనైనా వారిపై ప్రభుత్వ అధికారులు దయ చూపి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఇత్తడి ప్రకాష్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, సుంకర కిరణ్, శివ, దస్తగిరిమ్మ, వెంకటేష్, నాగరాజు రాజు, పెంచలయ్య, చెన్నయ్య, రవి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

ఉపాధి కూలీలకు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని ఉపాధి కూలీలకు రావాల్సి బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సగిలి గురయ్యా డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీల్లోని పిడుగుపల్లె, కలసపాడు పులారెడ్డిపల్లె తదితర పంచాయతీల్లో 5 వారాల పాటు పనులు చేసినా ఇంతవరకూ కూలి డబ్బులు వారి ఖాతాల్లో వేయలేదన్నారు. కూలి చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. పనికి తగ్గట్టు వేతనం రాలేదన్నారు. రోజువారీగా కూలి రూ. 150కు మించి దాటలేదన్నారు కూలీలకు కనీసం రోజువారి రూ. 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెంట్లు, ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు, పనిముట్లు, ఆటో ఛార్జీలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికీ వంద రోజులు పూర్తిపని కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు, పెండింగ్ కూలితోపాటు, సౌకర్యాలు కల్పించాలని డిమాడ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం గుర్రమ్మ, సుమలత, సాగర్, రాజు, గంగయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో భూమి సాగు చేసుకునే కౌలు రైతుల పేర్లను గుర్తించి వారికి సిసి ఆర్‌సి గుర్తింపు కార్డులను వెంటనే మంజూరు చేయాలని తహాశీల్దార్ కృష్ణ కుమార్, మండల వ్యవసాయాధికారి, జాకీర్ షరీఫ్ అన్నారు. సోమవారం తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఆర్ఒల సమావేశంలో ౖతుల సమస్యలపై మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో భూములు సాగు చేసుకునే కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం మండలంలో 229 గుర్తింపు కార్డులు ఇవ్వాలని చెప్పారు. మండలానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఎఒ షరీఫ్ మాట్లాడుతూ, మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 200 హెక్టార్ల మినుము , 50 ఎకరాల మొక్కజొన్న, చెరకు 100 ఎకరాలు, వరి నారు దశలో ఉందని తెలిపారు. ప్రస్తుతం సబ్సిడీ కింద రైతు సేవ కేంద్రంలో పచ్చి రొట్టె ఎరువులు ఇచ్చామని తెలిపారు. రైతులందరూ ప్పటికప్పుడూ వ్యవసాయ శాఖ అధికారి ఇచ్చే సలహా సూచనలు పాటించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రానికి 'అటవీ' దెబ్బ

- ఆలయ గదులను పడగొట్టేందుకు యత్నం
- స్థానికుల ఆందోళనలతో వెనుదిరిగిన వైనం
- ప్రజల మనోభావాలకు భంగం కల్గిస్తున్న అటవీ శాఖాధికారులు
- గడువిస్తే 'కేంద్రం'అనుమతులు తెచ్చుకుంటామన్న ఆలయ కమిటీ, స్థానికులు



గదులను పడగొట్టేందుకు పెద్ద ఎత్తున జ్యోతి క్షేత్రానికి వచ్చిన పోలీసులు, అటవీశాఖ అధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కాశినాయన

జిల్లాలోనే ప్రముఖ పర్యాటక క్షేత్రాల్లో ఒకటైన జ్యోతిక్షేత్రం ప్రసిద్ధి. మండలంలోని వరికుంట్ల సమీపంలోని జ్యోతి క్షేత్రంలో సుమారు 30 సంవత్సరాల కిందట శ్రీ అవధూత కాశినాయన జీవసమాధి అయ్యారు. అప్పటి నుంచి జ్యోతి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది యాత్రికులు, భక్తులు వస్తూంటారు. వారి కోసం ఆలయ కమిటీ గదులను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా గదులు నిర్మించారని సాకుగా చూపి అటవీ శాఖాధికారులు వాటిని పడగొట్టేదేకు యత్నించారు. పలుమార్లు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. పదేళ్ల కిందటే యాత్రికులు, ప్రజలు ఇచ్చిన చందాలతో గదులను నిర్మించారు. కొన్ని నిర్మాణం చివరి దశకు చేరుకున్నాయి. ఇటీవల కొంత మంది అటవీశాఖాధికారులు నిర్మాణ పనులు చేపటవద్దని నిలుపుదల చేశారు. అటవీశాఖ అధికారుల నిబంధనల మేరకే గదులు నిర్మించామని ఆలయ కమిటీ వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కానీ అటవీశాఖా అధికారులు, పోలీసుల సహకారంతో జ్యోతి క్షేత్రానికి వెళ్లి అక్కడ ఉన్న ఆలయ కమిటీ వారిని, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈఏడాది ఫిబ్రవరి 19న అటవీ, పోలీస్ శాఖాధికారులు బద్వేల్ ఆర్‌డిఒ వెంటరమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జ్యోతి క్షేత్రానికి వెళ్లి ఆలయానికి చెందిన గదులను పడగొట్టేందుకు యత్నించారు. స్థానికులు ఆందోళనతో వెనుదిరిగారు. మళ్లీ ఈనెల 13న ఆలయ గదులు అటవీశాఖకు చెందినవని గదులపై స్కెచ్ పెన్నుతో రాశారు. మరుసటి రోజు 14న రాష్ట్ర స్థాయి ఫారెస్ట్ అధికారులు క్షేత్రాన్ని సందర్శించడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఇలా అటవీ శాఖాధికారులు ఆలయ గదులను పడగొట్టేందుకు యత్నిస్తుండడం పలు విమర్శలకు దారి తీస్తోంది. తమకు కొంత సమయమిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకుంటామని ఆలయ కమిటీ వారు పేర్కొంటున్నారు.



గదులు తమ ఆధీనంలో ఉన్నట్లు రాసిన అటవీశాఖాధికారులు

ఎపిఐఐసి జడ్ఎం బదిలీ!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కె.శ్రీనివాసమూర్తి బదిలీ అయ్యారు. ఆర్అండ్‌బి ఇఎన్‌సికి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం సాయంత్రమే రిలీవ్ కానున్నట్లు తెలిసింది. మంగళవారం విజయవాడకు చేరుకుని ఇఎన్‌సి రిపోర్టు చేయనున్నారు. అనంతరం ఆయన మాతృశాఖ ఆర్అండ్‌బిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో పుట్టపర్తికి చెందిన సోను ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌గా రానున్నట్లు తెలుస్తోంది.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ జిఒ 82ను జారీ చేసిందని కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని తెలిపారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్ఎస్) తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఒపి సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా హెడ్ ఆఫ్ అకౌంట్: 8342-00-120-01-03-001-001, డిడిఒ కోడ్: 2703-0802-003. పద్దుకు రూ .1250 లు చెల్లించి 2025 మార్చి 31 వరకు పొందవచ్చునని తెలిపారు. ఒరిజనల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్సు, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని పేర్కొన్నారు.

రైల్వేకోడూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దళిత మహిళ అని చూడకుండా తనపై అన్నమయ్య జిల్లా, రైల్వేకోడూరు ఎస్ఐ నాయక్ చిందులు వేయడమే కాకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఓబులవారిపల్లె మండలం, చిన్నఒరంపాడు నివాసి ధార్ల సారమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త ఆనందబాబును కృష్ణా నగరకు చెందిన ఒక మహిళ ట్రాప్ చేసి రూ. 1 లక్షల తీసుకుని మోసం చేశారన్నారు. అప్పటి ఎస్ఐ మోహన్ గౌడ్, ఆ మహిళ కుమ్మక్కయి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేసారన్నారు. వారి వేధింపులు భరించలేక డబ్బులు చెల్లించామన్నారు. ఇటీవల కాలంలో ఎస్ఐ నాయక్, కానిస్టేబుల్ తన ఇంటికి వచ్చి మీరు పెట్టిన కేసులను విత్ డ్రా చేసుకోమని బెదిరిస్తున్నారని చెప్పారు. తాను 8 నెలల గర్భిణి అని, తన భర్తను, కుమారుడును చిత్రహింసలకు గురిచేస్తున్నారని వాపోయారు. తాను స్టేషన్‌కి వెళ్లి ప్రశ్నించగా కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కడప జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు చౌడవరం సుబ్బ నరసయ్య మాట్లాడుతూ ఎస్ఐ నాయక్ పై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేసి హోంమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో మండల నాయకులు కొరముట్ల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : చెరువు కట్టపై ఉన్న శివాలయం వద్ద నరాల వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం సోమవారం వారి కుమారులు నరాలశేఖర్, నరాల వెంకటసుభాష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఎస్.వి.రమణచ తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు హాజరై పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.పి రమణ, పలుకూరు భాస్కర్‌కట్ట సుబ్బరాయుడు, పలుకూరు విజయరామయ్య ,కట్టా వెంకటరమణ బూడుసు శ్రీనివాసులు తమ్మిశెట్టి అయ్యవారయ్య, కత్తి చంద్ర రోశయ్య పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నాలుగో సంవత్సరం ఆనర్సు డిగ్రీ అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. బిఎ (స్పెషల్ తెలుగు, ఎకనామిక్స్) , బి కాం (జనరల్), బిఎస్‌సి (బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమాటిక్స్) ఆనర్సు నాలుగో సంవత్సరం కోర్సులో అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఆసక్తి కల్గిన విద్యార్థులు కళాశాలలోని ఆయా సబ్జెక్టు ఇన్‌ఛార్జ్ లెక్చరర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారం ప్రజా సమసయల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ కృష్ణకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫిర్యాదుల దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ కచ్చితంగా హాజరు కావాలని అన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయమని శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కాలేజీలో ఒపి విభాగం, రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను సోమవారం ఆయన పరిశీలించారు. మెడికల్ కాలేజీ సిబ్బందితో వైద్యశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలకు మంచి వైద్యాన్ని అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి విగ్నేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వినయ్, డాక్టర్ రమణయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహేష్, డాక్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ సురేష్‌రెడ్డి

హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని పులివెందుల ట్రాఫిక్ సిఐ సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌పి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని నలంద కాలేజీలో విద్యార్థులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ బైక్ రైడర్స్, పిలియన్ రైడర్స్ హెల్మెట్ పెట్టుకోకపోవడం, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. చాలామంది తక్కువ దూరమే కదా అని హెల్మెట్ ఉన్నా పెట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అలా చేయడం మంచిది కాదన్నారు. ఇంటి నుంచే హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సిఐ తెలిపారు.

ముద్దనూరు: బైక్, స్కూటర్లలో ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ సూచించారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో సోమవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల రక్షణ ఉంటుందన్నారు. బైక్‌లో ప్రయాణించే సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణ హాని నుంచి కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా పథకం బదులు టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తామని ఎన్‌డిఎ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి నెల దాటినా రూ.20 వేలు కాదు కదా 0.20 పైసలు కూడా రైతులకు సాయం చేయలేదని విమర్శించారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఏరువాక పౌర్ణమి కూడా పూర్తయిందన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. సీజన్‌లో ఆర్థికసాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తులసిరెడ్డి పేర్కొన్నారు. వెంటనే చంద్రబాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఆర్థికసాయం ప్రతి రైతుకూ అందించాలని కోరారు. కౌలు రైతులకు కూడా ఆర్థికసాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలతో కలిపి మొత్తం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రైతు మోటార్లకు మీటర్లు బిగించే జిఒ 22ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి నెల దాటుతున్నా విద్యుత్ రంగంపై శ్వేతపత్రం కూడా ప్రకటించిందని తులసిరెడ్డి చెప్పారు. అయితే జిఒ 22 రద్దు ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. ఈ జిఒను చంద్రబాబు ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మోటర్లకు బిగించిన మీటర్లను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి జంప్ రోప్‌కు 48 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - మైదుకూరు

ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జంప్‌రోప్ ఎంపికలు నిర్వహించారు. 100 మంది విద్యార్థులు పాల్గొనగా 48 మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 28వ తేదీ వరకు నంద్యాల జిల్లాలో 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్‌రోప్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలో పాల్గొంటారని పీడీ వినోనియారాణి తెలిపారు. ముఖ్యఅతిథిగా మేధా విద్యా సంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. చెన్నంశెట్టి నరసింహులును ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ రామ్మోహన్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మునయ్య, చంద్రావతి పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలకు శ్రీకారం

ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 58 పరీక్షలకు నమూనాల సేకరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు మంచి రోజులు రానున్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో దాదాపు నాలుగేళ్లపాటు భూసార పరీక్షల ఊసే లేదు. అనంతరం గత ఏడాది అరకొరగా భూసార పరీక్షలు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మళ్లీ భూసార పరీక్షలను పునరుద్ధరణ చేయాలని నిర్ణయించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో భూసార పరీక్షలు లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా ఎరువులు వాడి అధిక పెట్టుబడుల కారణంగా రైతులు నష్టపోయేవారు. దీంతో ప్రభుత్వం మళ్లీ భూసార పరీక్షలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

రైతు సేవా కేంద్రం పరిధిలో 58 నమూనాలు సేకరణ

మండల వ్యాప్తంగా 11 రైతు సేవాకేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రం ద్వారా 58 నుంచి 70 వరకు మట్టి నమూనాలు సేకరణకు అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ స్థాయిలో పర్యటిస్తూ మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 700 మట్టి నమూనాలు సేకరించి అగ్రి ల్యాబ్‌లకు పంపనున్నారు.

మొక్క ఎదుగుదలకు భూసారమే కీలకం

రైతులు పంట సాగులో అధిక భాగం వ్యయం ఎరువుల కోసం పెట్టుబడులు పెడుతున్నారు. మొక్కకు కావలసిన పోషకాలు ఏ మేరకు అవసరమవుతాయో అర్థం కాక ఇష్టానుసారంగా ఎరువులు డీలర్ల సూచనల మేరకు ఎరువులు వేసి నష్టపోతున్నారు. అదే రైతులు మట్టి నమూనాలు అగ్రి ల్యాబ్‌లకు పంపించి వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వేస్తే మొక్క ఎదుగుదలతోపాటు రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేశారు. అయితే మిగిలిన రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.



పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

మట్టి నమూనాలు సేకరించడం మంచి నిర్ణయం

ప్రభుత్వం రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని నిర్ణయించడం ఎంతో శుభ పరిణామం. వ్యవసాయశాఖ భూ సార పరీక్ష కేంద్రం నుంచి ఇచ్చే ఫలితాల ఆధారంగా ఎరువులు వేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

- మురళి, రైతు, గురజాల

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం మట్టి నమూనా పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని భూసార పరీక్షలు చేయించుకోవాలి. దీని ఆధారంగా రైతులు ఎరువులను వాడడం వల్ల మొక్కలకు కావలసిన పోషకాలు సమృద్ధిగా లభించి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

- రామాంజనేయరెడ్డి, ఇన్‌ఛార్జి ఎఒ, సింహాద్రిపురం

ఇనుము దొంగలపై కలెక్టర్‌కు సిపిఎం ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఆర్అండ్‌బి కార్యాలయంలో ఇనుము దొంగలించిన ఆర్అండ్‌బి డిఇ లక్ష్మీ నరసింహులుపై సిపిఎం ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి సత్యనారాయణ సోమవారం కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్అండ్‌బి డిఇగా పనిచేస్తున్న లక్ష్మీ నరసింహులు ఆయన పనులు పక్కనపెట్టి కార్యాలయంలో ఉన్న10 టన్నులుకు పైగా ఇనుమును బయటికి తరలించారన్నారు. కొద్దిరోజుల తర్వాత ఈ విషయం బయటికి రావడంతో మళ్లీ ఆ ఇనుమును కార్యాలయానికి చేర్చారన్నారు. దాన్ని ఎవరు కార్యాలయానికి చేర్చారు.. ఏ వాహనం వచ్చింది వంటి విషయాలను సిసి కెమెరాలో పరిశీలించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బి ఇఇ ఈ విషయాన్ని విచారించకుండా డిఇని కాపాడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఆయన అవినీతి కూడా పెద్ద ఎత్తున జరుగుతోందని గుంతలు పూడ్చేవాటిలో కూడా లంచాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎక్కడైనా పనులు చేయిస్తే అవి నాణ్యత లేకుండా ఉంటాయన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన ఆస్తులపై ఎసిబికి లెటర్ రాస్తామన్నారు. వీటిపై చర్యలు తీసుకోకపోతే ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

పట్టణంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా విజృంభిస్తోందన్నారు. ఈ తరుణంలో దోమల నివారణా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దోమలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి దోమల నివారణకు వార్డులలో ఫాగింగ్ చేయించాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, నాయకులు సూరి, రమేష్, రాఘవ పాల్గొన్నారు.

ఆర్‌పిలు, సిఒలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని డ్వాక్రా సంఘాల ఆర్‌పిలు, సిఒలపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 637 డ్వాక్రా సంఘాలున్నాయని, వాటికి రుణాలు మంజూరైన ప్రతిసారి ఆర్‌పిలు, సిఒలు కమీషన్లు కావాలంటూ వేధిస్తున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలను వేధిస్తున్న వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ స్పందించి విచారించి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రకాశం, సత్యం స్వామి, రాజశేఖర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తమ భూ సమస్యలు పరిష్కరించాలని సోమవారం పలువురు తహశీల్దార్ భీమేశ్వరరావుకు వినతిపత్రాలిచ్చారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో వారు తమ సమస్యలు రాతపూర్వగా విన్నవించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పొట్లదుర్తి గ్రామంలో సోమవారం 40 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. టిడిపి కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ వైసిపిలో వాలంటీర్లకు ఇచ్చిన ప్రాధాన్యత నాయకులకు ఇవ్వ లేదన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాష్ట్రాన్నే తాకట్టు పెట్టిందన్నారు. అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. సీఎం సురేష్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలా ఎన్‌డిఎ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేయబోదన్నారు. పార్టీలో చేరిన వారిలో కంచం రెడ్డి రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి సుబ్బిరెడ్డి, గంగిరెడ్డి సుబ్బిరెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జంగా బాలిరెడ్డి, కంచంరెడ్డి శివరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొత్తపల్లి సుబ్బారెడ్డి, చల్లా సుధాకర్‌రెడ్డి, పడిగపాటి శివారెడ్డి, మాలపాటి జయరామిరెడ్డి, వెంకట శివారెడ్డి, అంకిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.



టిడిపిలో చేరిన వారితో సురేష్ నాయుడు

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం నుంచి నీటి సమస్య ఉండడంతో.. సోమవారం స్థానిక టిడిపి నేతలు ఆ సమస్యను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, 16 వార్డు ఇన్‌ఛార్జి యాపరాల చిన్న తాగునీటి సమస్యను పరిశీలించారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది మోటరు మరమతులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కౌలుదారులకు సాగు ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

కౌలురైతులకు సాగు హక్కు పత్రాలను అందజేయనున్నట్లు తహశీల్దార్ వెంకటలక్ష్మి, వ్యవసాయ అధికారి నాగార్జున తెలిపారు. మండలం పరిధిలోని చెముళ్లపల్లె గ్రామంలో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కౌలు భూముల రైతులు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. 11 నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. పంట నష్టపరిహారం, పంటల బీమా, మద్దతు ధర, అన్నదాత సుఖీభవ వంటి ప్రయోజనాలను కౌలు రైతులు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటకుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-గోపవరం

గోపవరం మండలం ప్రాజెక్టు కాలనీ-2లోని ఇంట్లో సోమవారం విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మన్యం అశోక్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



నవనీతను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

జాతీయ స్థాయి పోటీలకు డిగ్రీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయస్థాయి పోటీలకు వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నవనీత ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. జాతీయస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన నవనీతను సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బిఎస్సీ రెండివ సంవత్సరం చదువుతున్న నవనీత ఇటీవల విజయవాడలో జరిగిన ఫ్లోర్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి, జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో హరియానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగే పోటీల్లో నవనీత ఆంధ్ర జట్టు తరుపున హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభ చూపి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలకొండ గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, డాక్టర్ నాగలక్ష్మి, లైబ్రేరియన్ మాధవరావు, అరవింద్ పాల్గొన్నారు.

జాతీయ తేక్వాండో ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



పతకాలు సాధించిన విద్యార్థులు

ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్ కె.వి.బి.ఆర్.ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ తేక్వాండో ఛాంపియన్ షిప్‌లో ప్రొద్దుటూరు విన్ తేక్వాండో అకాడమీ విద్యార్థులు ఐదు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. సబ్ జూనియర్ బాలురు 21కిలోల విభాగంలో నిసార్ (బంగారం), 23 కిలోల విభాగంలో యం.వి.సాయిదినేష్ (వెండి), సబ్ జూనియర్ బాలికల 24 కిలోల విభాగంలో ఐ. బిమాంషి(బంగారం), 29 కిలోల సబ్ జూనియర్ బాలికల విభాగంలో కె.త్రివేణి (బంగారం), కేడెట్ బాలికలు 51 కిలోల విభాగంలో మహితారెడ్డి(బంగారం), పూమ్సేకేడెట్ బాలికల విభాగంలో ఎస్.ఆక్సా (బంగారం) పతకాలను సాధించారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులతోపాటు ఎపిఎస్‌పిడిసిఎల్ బిసి అధ్యక్షుఉలు మురళీమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.



విద్యా సామగ్రితో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దాతల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - ఖాజీపేట

దాతల సహకారం మరువలేనిదని, ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని పశువైద్యాధికారి బాబు రామచంద్ర కోరారు. మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీ కొత్త పుల్లూరు యానాది కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థులకు పలకలు, రాత పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో 'విద్యా జ్యోతి' కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మాడె గురు శంకర్‌రెడ్డి (అగ్నిమాపక శాఖ ఉద్యోగి) ఆర్థికసాయంతో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బాబు రామచంద్ర మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సాయపడడం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులు, గురు వులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వాగ్దాడం శివశంకర్, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమ ట్రస్ట్ కార్యదర్శి వేములూరి మాల కొండయ్య ఆచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశంకర్, బాబు, మారం ప్రతాప్, నెహ్రూ యువ కేంద్ర వాలంటరీ నరేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ వైఎస్ మహమూద్ గౌస్

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు సీనియర్ మైనార్టీ నాయకులు వైఎస్ మహమూద్ జయంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారులు 22వ వార్డు కౌన్సిలర్ వైఎస్ మహమూద్ గౌస్, డాక్టర్ వైఎస్ ముస్తఫా, వైఎస్ ముపాజ్ ఆధ్వర్యంలో పలు చోట్ల అన్నదానం చేపట్టారు. స్థానిక అమ్మానాన్న వృద్ధ శరణాలయం, మదర్ థెరిస్సా వృద్ధ శరణాలయం, ప్రభుత్వ వైద్యశాల వద్ద స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ మహమూద్‌ను స్మరించుకుని ఆయన కుమారులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మున్నా, షేక్ మున్నా, వైఎస్ఎం యూత్ సభ్యులు ఇలియాస్, అరీఫ్, ఇబ్రహీం, నరేంద్ర, రోటరీ రియాజ్, సమీర్, అక్రమ్, ఆసిఫ్, ఖలీం పాల్గొన్నారు.

కండక్టర్ మృతికి అధికారులు, నాయకులు నివాళి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఆర్‌టిసి డిపోకు చెందిన జమ్మలమడుగు-తిరుపతి సర్వీసు బస్సు ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై కండక్టర్ సిజెటి రాముడు మృతికి సంస్థ జిల్లా అధికారులు, యూనియన్ నాయకులు నివాళులర్పించారు. సోమవారం వారు స్థానిక మోరగుడిలోని మృతుడు రాముడు ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంస్థ తరపున అన్ని సహాయ సమకారాలు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి కడప జోనల్ కార్యనిర్వహణ అధికారి గిడుగు వెంక టేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు డిపో మేనేజర్ పి.వి.ప్రవీణ్, జమ్మలమడుగు డిపో సిబ్బంది, బంధువులు పాల్గొన్నారు.



రాముడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్‌టిసి అధికారులు

IN THE COURT OF THE HONOURABLE JUNIOR CIVIL JUDGE : JAMMALAMADUGU

E.P.No. 72/2023

O.S.No. 26/2021

Sri Rama Krishna Filling Centre Represented by Its Proprietor Tanguturu Raja Sekhar Reddy, S/o Late T.Rami Reddy aged about 38years, Hindu, Business, Residing at D.No.21/612, Tadipatri Road, Jammalamadugu town and Mandal, kadapa Dist. **...Petitioner/D.Hr**

Vs

Sri Siva Shakthi Sai Transport Represented by its Proprietor Sanjamala Raghunatha Reddy, S/o Nagi Reddy, Hindu, Aged about 31 years, Business, Residing at Chinna Komerla Village, Opp.Dalmiya Cements Mylavaram Mandal, Kadapa Dist. **...Respondent/J.Dr.No.1**

ప్రకటన

పై నెంబరు E.P.ని D.Hr., J.Dr.No.1 పైన రాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి E.P.లో J.Dr.No.1 అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈప్రకటన ద్వారా మీకు తెలియజేయడమేమనగా 29.7.2024వ తేదీన వాయిదా వున్నది. కావున పై నెంబరు E.P.నందు ఉదయం 10.30 గం॥కు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైన ఆక్షేపనలు వున్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవచ్చును. లేనంతట రాజశ్రీ కోర్టు వారు మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా (పరోక్షముగా) తీర్మానించబడును.

వాయిదా తేది: 29.07.2024

//By Order of the Court//

పాలాజి రవికుమార్

అడ్వకేట్, జమ్మలమడుగు

పని చేయని వారిపై చర్యలు

- విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.రమణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విధుల్లో ఉంటూ పనులు చేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ హెచ్చరించారు. స్థానిక పతంగే రామన్నరావు పంక్షన్ హాల్‌లో సోమవారం డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జమ్మలమడుగు 33/11 కె.వి దేవగుడి సబ్‌స్టేషన్, ఇతర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత నియమాలు విధిగా పాటించాలని తెలిపారు. అంతరాయలను నిరోధించి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో జమ్మలమడుగు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజబాబు, రామకృష్ణయ్య, శ్రీనివాస వర్మ, ఓబులేసు, సీతాంబరరెడ్డి, జూనియర్ ఇంజనీర్లు, జెఎఒ విజయ బాబు, అకౌంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఇఒలు, పిఆర్‌పిలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య ప్రతినిధి కత్తి ఓబులేసు కోరారు. ఆ మేరకు ఆయన సోమవారం డిప్యూటీ డిఇఒ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలుతున్నాయన్నారు. పాఠశాలల్లో నీటి కొరత ఉండడం వల్ల మధ్యాహ్న భోజన పథకంలో స్వచ్ఛమైన నీరు వాడడం లేదన్నారు. పదిరోజుల కిందట జరిగిన ఖాజీపేట హైస్కూల్ సంఘటన గుర్తు చేశారు. ప్రొద్దుటూరు పరిధిలో వేలాది మంది విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. అధికారుల పర్యవేక్షణ సరిగాలేక సమస్యలు పేరుకు పోతున్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఓబులేసు కోరారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణ పరిధిలోని మట్టి మసీదు నుంచి 25వ వార్డు 27వ సచివాలయం వరకు దాదాపు 400 మీటర్లు ఇరువైపులా అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ కోరారు. పట్టణానికి ప్రధానమైన రామేశ్వరం-కొత్తపల్లి కాలువ కొంతకాలంగా పూడికతీతకు నోచుకోకపోవడం వల్ల కంపు కొడుతోందన్నారు. ఆయా ప్రదేశాలను మున్సిపల్ కమిషనర్ స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని నజీన్ కోరుతూ సోమవారం కమిషనర్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తేలికపాటి వర్షం వచ్చినా డ్రెయినేజీ నీరంతా ఇళ్లల్లోకి వస్తోందని, స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలు తున్నాయన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నజీర్ కోరారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న నజీర్